

# బర్డ్ వాచింగ్

''సురేష్! యెప్పుడూ అక్కడే కూచుని కనిపిస్తావు రాగానే. యేమీ చూస్తావంత తదేకంగా? విసుగెత్తదూ'' అన్నాడు రమేష్ లోపలికొస్తూ.

సురేష్ నాలుగంతస్తుల హర్మ్యంలో నాలుగో అంతస్తులో బల్లమీద కూచుని, చిన్న కిటికీ గుండా చూస్తూ వుంటాడు. బైనాకులర్సు వాడతాడు. ఆ హర్మ్యం అతనిదే. కాంట్రాక్ట్ పద్ధతి మీద గల్ఫ్ దేశాలు వెళ్లి బాగా సంపాయించుకొచ్చి, తానే ప్లాన్ వేసి హర్మ్యం లేవదీశాడు. అతను ఆర్కిటెక్ట్. అన్ని ఫ్లాట్సూ అమ్మి పై భాగం తన కోసముంచుకున్నాడు. బేస్‌మెంట్‌లో కార్లు, స్కూటర్లూ, మోటార్ సైకిళ్లూ వుంచుకోవచ్చు. లిఫ్టున్నది. వాచ్‌మన్ వున్నాడు. సురేష్ పర్మనెంట్ జాబ్ చేయడు. టెంపొరరీ జాబ్స్ తనకు నచ్చినవే చేస్తాడు. వివాహ సంస్థను మెచ్చడు.

''ప్రశ్నవేస్తూ వస్తావు రమేష్. అది నీ అలవాటు. అలాగే పక్షుల అలవాట్లు తెలుసుకోవటం చూడటం నా కలవాటు. చిన్నప్పుడే వున్నదా అలవాటు. వడ్రంగి పిట్ట చెట్టు బోదె మీదే కూచుని చెట్టు బెరడు పొడుస్తూ కన్నం చేస్తుంటే నిలబడి చేతులు వెనకవుంచి చూసేవాడిని. తాతగారి వూరు వెళ్ళి పొలాల వేపు వెళ్తే గిజిగాడు గూడు కట్టటం కంటబడేది. మరో చెట్టుకు వేలాడే గూళ్లు చూసేవాడిని. పికిలి పిట్టలు, పాలపిట్టలు, తెల్ల కొంగల బారులూ, చిలకలబారు, అడవి పావురాళ్లూ కనబడేవి. యెగిరే పాలపిట్ట, మాలకాకులూ వినోదమిచ్చేవి. నిన్ను చూస్తుంటే విసుగేయటంలేదే రమేష్? రోజూ రమ్మీ నాలుగ్గంటలాడితే నీకు విసుగులేదే? రెండు పేకలు కలిపి, తొమ్మిది కుర్చీలలో తొమ్మిది మంది మిత్రులు గుండ్రగా కూచుని, సిగరెట్లు తగలేస్తూ, సోడాలు, ఛిప్సూ పూర్తిచేస్తూ ఆడతారు. నాగా వుండదు రమ్మీకి. అంతేనా రమేష్! ఒకే పెళ్లాంతో కాపరం. దాని పిల్లలు, వాళ్ల బాధ్యతలూ, కీ, బామని అరుపులూ, చిన్న పాప వుయ్యాల్లో గుక్కపట్టి యేడుపు, యిద్దరు అల్లరి, మరి కొంచెం యెదిగిన వాళ్లు కలేబడటం, నువ్వు

విడదీయటం, వారి డిమాండ్లు తీర్చటం, ఆ రొటీన్ విసుగేయదూ? మొహం మొత్తదూ? అంతకన్న బర్డ్ వాచింగ్ మంచి వినోదమిస్తుంది. నువ్వూ చూస్తే నిన్నూ ఆకర్షిస్తుంది'' అన్నాడు లేవకుండానే.

రమేష్ సుఖాసీనుడై యెదురుగా బల్లమీదున్న, తన కోసమే యెదురుచూస్తున్న డ్రింకుగ్లాసు అందుకున్నాడు. చల్లని ద్రాక్ష పానీయం సిప్ చేయసాగాడు.

''మల్లా జాబ్‌కి డైవోర్సిచ్చినట్టున్నావే సూరీ! యేమిటిదాని తప్పూ? తగాదా పడ్డారా? కోర్టు వరకూ వెళ్లారా? ఏకపత్నీవ్రతం యెంత గొప్పదీ! ముగ్గుర్ని పెళ్లాడి దశరథుడు క్రైసిస్ తెచ్చి పెట్టుకున్నాడట. డబ్బూ, అందం, డిగ్రీ, సమర్థతా, అండదండా వున్న అమ్మాయి నాతో జీవించడానికి వస్తే, దానికి విడాకులిచ్చేదా? అటువంటివి స్టేట్స్‌లో బావుంటాయి. సంతు వింతలు చూపుతారు. క్లాస్‌లో ఫస్ట్ వస్తాడొకడు, స్కూల్ ఆనివర్సరీకి వేదికమీద ట్విస్ట్ డాన్సు చేసి ప్రైజు కొడుతుందొకతె. నోట్లో వేలేసుకుని దిసమొలతో నేలమీద మరిగాళ్లేసుకు్కూచుని నే కనబడంగానే హర్షం వెలిబుచ్చుతాడొకడు. సర్వేరాయి మీద కూచుని నా కోసం యెదురుచూస్తుందొకతె. నా ప్లేటులో కలియబడి తినేదొకటైతే, నేను రానిదీ అన్నం తినదొకతె'' అలా చెప్తూ పానీయం గుటకలేస్తున్నాడు రమేష్.

''పక్షులూ అటువంటి స్వభావాన్ని చూపుతాయి. రెక్కలు రాని పక్షి కూనలు, తల్లి ఆహారం తెస్తుందని యెదురు చూడటం, అరవటం, తల్లి తెచ్చిన ఆహారాన్ని ఆత్రంగా తినటం, ఆహారం అయిపోగానే తల్లి పక్షి మళ్లా యెగిరిపోతుంది. గుడ్డును లోపలినించే ముక్కుతో పొడిచి మెల్లిగా తానే బయటకొచ్చి గూటిలో పడుతుంది పక్షికూన. ప్రపంచం సుందరమే. కాని ఆకలి రక్షణ కావాల్సి అరుస్తుంది. యేమిటన్నావూ? నేను కోర్టుకూ వెళ్లలేదు. లాయరుతోనూ పనిబడలేదు. నెలముందే నోటీసిచ్చి వచ్చేశా. ఒక్కోసారి తల్లే గుడ్డును పొడిచి పగలగొడుతుంది వినతాదేవిలాగా''.

''అబ్బో! బాచులర్ గారికి పురాణంలోనివి తెలుసే! వినతాదేవి గుడ్డునెందుకు పగలగొట్టిందిటా?'' రమేష్ నవ్వుతున్నాడు.

''కద్రువ వినతకి సవితి అక్క. కాద్రవేయులే, అందంగా బలంగా, వన్నె వన్నెలతో పుట్టారు. పడగలు విప్పి ఆడుతూ తల్లికి వినోదం కలిగించేవారు. కద్రువ తన సవితి చెల్లెలు వినతను వుడికించేది. ''వినతా! నా బిడ్డలు చూడెంత బావున్నారో!'' అనేది. వినత గుడ్డు పెట్టింది గానీ, అదెన్నాళ్లకూ పగలలేదు. విసుగేసి, అసూయ పురికొల్పగా తానే ముక్కుతో పొడిచి పగలగొట్టింది గుడ్డును. నడుం వరకే యెదిగి, యింకా కాళ్లు యేర్పడని కొడుకు బైటబడ్డాడు. తనను తాను చూచుకుని వ్యథ జెంది, తల్లిపై కోపించి శపించాడు. వాడిపేరు అణూరుడు. వూరువులు లేనివాడు.

''తొందరపడి గుడ్డు పగలగొట్టావేమమ్మా? నేను పూర్తిగా యెదగలేదు చూడు. కారణం నువే. ఓర్మిగలిగి వుంటే పూర్తిగా యెదిగి నేనే గుడ్డు పగలగొట్టి బయటపడేవాడిని. నా కుంటితనానికి నువే కారణం గనక నీకు తెలిసిరావాలి. మీ అప్ప కద్రువకి దాసివవుతావు'' సురేష్ బైనాకులర్స్‌లోంచి చూస్తూ ఆపాడు.

''యెందుకు నోటీసిచ్చావని మీ బాస్ అడగలేదూ?'' అనడిగాడు రమేష్.

''అడిగాడు. వెళ్లద్దు అని గూడా అన్నాడు. పర్మనెంట్ చేస్తానని ఆశపెట్టాడు. 'పని యెక్కువౌతున్నది. మరోడి పనీ చూడమంటున్నారు. బర్డ్ వాచింగ్‌కి టైమ్ లేదు. ఫిమేల్ వర్కర్సు డిస్టర్బ్ చేస్తున్నారు. నా తత్వానికి పర్మనెంట్ జాబ్ పడదు' అని చెప్పాను. వింత కలిగినట్టు చూశాడు బాస్''.

''ట్విస్ట్ వద్ద ఆగింది పురాణగాథ కంటిన్యూ చేయిమరి''. ''నీకు తెలియదా రమేష్. పెద్ద చదువే చదివావే?''

''పెద్ద చదువూరికే వస్తుందా? ఫస్ట్ క్లాసులూ, సీట్లూ పుస్తకాలలో తలదూరిస్తేగానీ రావు. లైబ్రరీకి వెళ్లాలి. నే చదివిన చదువులో పక్షుల కథలు లేవు. చదువు ముగిసిందని గట్టున బడ్డాననుకుంటే స్థిరపడింది. అది కాగానే ఆమె తోకబట్టుకు తిరగాల్సి వచ్చింది. కూనా గురుజూ టైం డిమాండ్ చేస్తూ

వచ్చేశారు. కథలు విననిస్తేనా? కానీ మరి''.

''కాళ్లు లేని బిడ్డకాళ్లెలా పట్టుకుంటుందీ తల్లీ? వాటేసుకుని కన్నీళ్లతో తడిపింది బిడ్డని'' నాయనా! యీ తల్లిని క్షమించు. అసూయకు లోనై తప్పు చేశాను. తొందరపడ్డాను. యీ తల్లికి శాపవిముక్తి చెప్పు'' అనడిగింది వినత. కొడుకు, తానూ తొందరపడి శపించానే అనుకుని, ''యేడవకమ్మా! తప్పు ఒప్పుకున్నావు. అదీ గొప్పే. మరో గుడ్డు పెడతావు. దాన్ని చితపకు. పూర్తిగా పెరగనీ, తమ్ముడు తానే ముక్కుతో గుడ్డు పగలగొట్టి బైటబడతాడు. ఆరోగ్యంగా బలంగా యెదుగుతాడు. వాడు నీ దాస్యం వదిలిస్తాడు'' అని ఓదార్చి సూర్యుని రథానికి సారథిగా వెళ్లిపోయాడు అణూరుడు.

కద్రువ, వినతనూ, దాని కొడుకు వైనతేయునీ దాసీలలాగానే చూసి పనిచేయించేది. వైనతేయునికి విసుగేసింది. అవమానాలూ భరించలేక తల్లినడిగాడు. 'పెద్దమ్మ కద్రువకీ ఆమె కొడుకులకీ మనం దాస్యమెందుకు చేయాలి?''. వినతాదేవి కళ్లు తుడుచుకుంటూ చెప్పింది. పెద్దకొడుకు శాపమిచ్చాడు. ''నాయనా వైనతేయా కద్రువ వుడికిస్తే, అసూయతో నా గుడ్డు పగలగొట్టాను. కాళ్లులేని అణూరుడు పుట్టి శపించాడు. దాసినెలా అయినానంటే వైనతేయా! కద్రువా నేనూ పొద్దూకే వేళ చల్లగాలికి వెళ్లాము. తెల్లని గుఱ్ఱాన్ని చూసి, ''అక్కా! ఆ గుఱ్ఱమంతా తెలుపే'' అన్నాను. కద్రువ, ''లేదు వినతా తోకలో నల్లని చుక్క వున్నది'' అన్నది. వాదించుకున్నాము. చీకటిపడింది. నీకు కనిపించటం లేదు. రేపు వద్దాం రా వినతా. నీవన్నది నిజమైతే నేను నీకు దాసిని నేనన్నది నిజమైతే నీవు నాకు దాసివి కావాలి'' అన్నది అక్క. నేనే గెలుస్తాననుకుంటూ వచ్చేశాను అక్కతో. కద్రువ చేసిన మోసం తరవాతెప్పుడో వెల్లడైంది వైనతేయా! కద్రువ ఆ రాత్రి తన కొడుకులతో అన్నది. ''మీలో ఒకరు వెళ్లి ఆ తెల్ల గుఱ్ఱంతోకలో దాక్కొని వుండి నల్లని తలపైకి కనబడేట్టు చేయాలి. నేను వినతా పందెం వేసుకున్నాము. తెల్లని గుఱ్ఱము అన్నది వినత తోకలో నల్లచుక్క వున్నదన్నాను నేను. వినత గెలిస్తే నేను దాస్యం చేయాలి. నేను గెలిస్తే

వినత దాసి అవుతుంది. మీరు నన్ను గెలిపించాలి రేపు''. కాని కొడుకులు ఒప్పుకోలేదట. ''నీ తప్పు ఒప్పుకో. వినత పిన్ని మంచిది నిన్ను దాసిని చేయదు'' కద్రువకి పట్టరాని కోపమొచ్చి, ''మీరంతా జనమేజయుడు చేయబోయే సర్పయాగంలోపడి చస్తారు'' అంటుంటే చివరి బిడ్డ లేచి వచ్చి తల్లి కాళ్లు చుట్టేసుకుని, ''నేను గుఱ్ఱం తోకలో దాక్కుని తల చుక్కలాగా కనిపించేట్టు చేసి నిన్ను గెలిపిస్తా అమ్మా! అందర్నీ చంపకు. ముక్తి చెప్పు'' అని యేడిచాడట. '' ఆస్తీకుడనే బ్రాహ్మణ వటువు, వాసుకి మేనల్లుడు, జరత్కారుడనే రుషికీ జరత్కారి అనే నాగజాతి స్త్రీకి పుట్టినవాడు, వాసు చెల్లికిచ్చి పెళ్లి జరిపాడు, వచ్చి యాగం, జనమేజయుని చేత ఆపేయిస్తాడు'' అన్నది కద్రువ. మరునాడు సాయంత్రం సూర్యాస్తమయం వేళ వెళ్లాము కద్రువా నేను. తెల్లని గుఱ్ఱంతోకలో నల్లని చుక్క కనిపించింది. నమ్మి దాసినైనాను. నీవు దాసీ పుత్రుడివి'' అని కొంగుతో కళ్లు తుడుచుకున్నది వినత.

వైనతేయుడు జాగు చేయకుండా, కద్రువ పెద్దమ్మా ఆమె బిడ్డల దగ్గరకెళ్లి, ''అమ్మా, సోదరులారా! యేదైనా అడగండి. తెచ్చిస్తాను. ఈ దాస్యం తీసేయాలి. మాకు స్వేచ్ఛ కావాలి'' అని సవిత్తల్లికి అన్నలకు దణ్ణం పెట్టాడు.

''అమృతం తెచ్చిపెట్టు. దాస్యం తీసేస్తాము'' అని వాగ్దానం చేశారు కద్రువ, కాద్రవేయులూ.

తల్లితో చెప్పాడు వైనతేయుడు. ''నాయనా వైనతేయా! నీ తండ్రి కశ్యప ప్రజాపతి హిమాలయాల వద్ద తపస్సు చేస్తూ వుంటాడు. తండ్రిని దర్శించి అంతా చెప్పి ఆయన ఆశీస్సులు పొంది వెళ్లు'' అన్నది వినత.

వైనతేయుడు తండ్రిని కలుసుకుని, అంతా చెప్పి, ''అమృతం తెచ్చిచ్చి మా దాస్యం వదిలించుకోవాలి. వెళ్తున్నాను'' అన్నాడు.

కశ్యపుడు సంతోషించాడు. ''వైనతేయా! అమృతం తేవటం అంత సులభం గాదు. నీకు పిన్న వయసు. అమృతభాండం యింద్రుని అధీనంలో వుంటుంది. దాని చుట్టూ గట్టికాపలాయే పెట్టాడింద్రుడు. మంటలు, పాములు, సాయుధ

భటులూ యింతమందిని జయించాలి. నీకు నా ఆశీస్సులిస్తాను. నీవు అటుగా వెళ్లాలి. పెద్ద తటాకంలో తాబేలున్నది. దాని పట్టుకెళ్లి తినాలి. కావాల్సినంత బలం చేకూరుతుంది''.

వైనతేయుడు తండ్రి చెప్పిన వేపు వెళ్లి తాబేలును కాళ్లతో తన్నుకు పోయి, ఒకపెద్ద చెట్టు కొమ్మమీద కూచుని తిందామనుకుంటే, ఆ కొమ్మ విరిగింది. ఆ కొమ్మకి తలకిందుగా వేలాడుతూ తపస్తు చేసుకుంటున్న వాలఖిల్యాది మునులు అరిచారు. వైనతేయుడు ముక్కుతో కొమ్మపట్టుకుని యెగురుతూ వెళ్లి సురక్షితమైనచోట వారిని వదిలి వెళ్లి, వేరే చోట తాబేలును తినేశాడు. బలశాలి అయి అందర్నీ జయించి అమృతభాండం వుగ్గం ముక్కుతో పట్టుకుని వచ్చేస్తుండగా యింద్రుడు వెంటబడ్డాడు. వాడినీ వోడించాడు వైనతేయుడు. ఇంద్రుడు వదల్లేదు. వెంటవస్తూ, ''వైనతేయా! యేదైనా అడుగు యిస్తా. కాద్రవేయులు విషజంతువులు. వారికి అమృతం యివ్వరాదు'' అన్నాడు.

''వీల్లేదు యింద్రా. మా దాస్యం వదిలిపోవాలి. అమృతం తెచ్చివ్వమన్నారు. ఇస్తానన్నాను. ఇవ్వాలి'' అన్నాడు వైనతేయుడు.

''అలా అయితే వైనతేయా! అమృత భాండం వారికెదురుగా కింద వుంచి. ఇదుగో తెచ్చిచ్చానని నీవు వెళ్లిపో నేనెలాగో వారికాభాండం చెందకుండా తెచ్చేసుకుంటా. నువ్వు అడ్డురాకు. ఒప్పందం బాగున్నదా?'' అన్నాడు ఇంద్రుడు.

''అలాగే తెచ్చుకో. నేనెందుకడ్డు వస్తాను'' అని వెళ్లి దర్భలు పరిచి దాని మీద అమృతభాండముంచి వైనతేయుడు, ''యిదుగో అమృతం తెచ్చిచ్చాను. ఇప్పటినించే నేను మా అమ్మ వినతాదేవీ స్వతంత్రులము'' అని వెళ్లిపోయాడు.

ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి, ''అలా మైలదుస్తులతో మట్టి చేతులతో అమృతం తాకరాదు. తాగరాదు. స్నానాలాడిరండి. నేనిక్కడే కాపలా వుంటాను'' అని పంపాడు కాద్రవేయులనూ కద్రువనూ. వారటువెళ్లగానే అమృతభాండంతో స్వర్గానికెళ్లిపోయాడింద్రుడు.

కద్రువ కాద్రవేయులూ, వచ్చి చూసి, మోసపోయామని తెలుసుకుని ఆశచావక, అమృతం చిందివుంటుందని దర్భలు నాకారు. ఒక్కొక్క నాలుకా రెండుగా చీలింది. అందకని ద్విజిహ్వులు అని పిలువబడ్డారు''.

రమేష్ చప్పట్లు కొట్టి, ''వండర్‌ఫుల్! చాలా బావున్నది పక్షి కథ. మంచి చెపితే అర్థం చేసుకుని విన్నాడు. దాస్యమూ వదిలించుకున్నాడు. పొద్దూక వచ్చింది పోదామా సురేష్? పక్షులు గూళ్లకెళ్తున్నాయి. చెట్లమీద గూళ్లు చేరిన పక్షులు అరుస్తున్నాయి''.

'' ఒకే. నేను పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్నాను. దాని తర్వాత రెస్టారెంటు'' అని కిటికీ మూశాడు సురేష్.

''నాక్కూడా విహంగ వీక్షణంలో యింటరెస్ట్ కలిగింది సురేష్'' అని లేచాడు రమేష్.

''మనకు మిత్రలాభంలో లఘుపతనకుడనే కాకీ హ్రస్వగ్రీవుడనే పావురము వచ్చి వినోదమిస్తాయి''.

2

రమేష్ వీలున్నప్పుడూ, మరియూ యింట్లో కాకులల్లే అరిచే చుట్టాలున్నప్పుడూ, పరాన్నభుక్కులొచ్చినప్పుడూ విహంగవీక్షణానికి సురేష్ వద్దకి వచ్చేస్తున్నాడు.

''కవి లాగానూ, అతికినట్టూ మాట్లాడుతావు సురేష్''.

''కవిత్వం గాదు రమేష్. రామాయణంలో జటాయువున్నాడు. కాకాసురుడున్నాడు. నలచరిత్రలో స్వర్ణహంస సందేశాలందించి, నలదమయంతులను కలిపింది. బర్డ్ వాచింగ్ మీద పుస్తకాలున్నాయి చదివాను. కాళిదాసుకి మంచి పేరొచ్చింది. ఢక్కా కవి అనేవాడు కాళిదాసును ఓడించి, కాళిదాసు కన్నగొప్పవాడనిపించుకోవాలని బయలుదేరాడు. ఢక్క వాయించి వాదన మొదలెడితే యెవరూ ఓడించలేకపోయేవారట. అందుకనాపేరు వచ్చింది. కాళిదాసుకి తెలిసింది. ధారా నగరం పొలిమేరల్లో మేకలను మేపుతూ

గొల్లవానిలాగా గొంగళీ కప్పుకుని, కర్రతో నిలబడివున్నాడట. ఢక్కా కవి కనిపించగానే దణ్ణం పెట్టి

''యెవరండీ తమరు? ధారానగరం వేపు వెళ్తున్నారే'' అనడిగాడుట.

''నా పేరు ఢక్కా కవి. కాళిదాసు నోడించి, భోజరాజుచే సన్మానాలందుకోవాలని వెళ్తున్నాను'' అన్నాడట కవి.

''నేనడిగేవి చెప్పగలరా?'' అనడిగాడట కాళిదాసు.

''అడుగు'' అన్నాడు కవి.

కాళిదాసు వెంటనే గుప్పిలితో గుప్పెడు యిసక తీసి పట్టుకుని ''యివియెన్ని'' అనడిగాడుట.

''యేమో. నాకు తెలియదు. నేను లెక్కపెట్టలేదు'' అని కవి జవాబిచ్చాడు. ''నీకు తెలుసా. నువు చెప్పగలవా?'' అని గూడా అన్నాడుట.

'' ఇంతేనా కవిగారూ? ఇది గుప్పెడు యిసక. పోనీ యిది చెప్పగలరా. పొద్దున్నే కాకులెందుకరుస్తాయి?''

కవి విసుగ్గా చూసి, ''యేమో కాకులూ కుక్కలూ యెందుకరుస్తాయో తెలియదు. అదీ పొద్దున్నే. నువ్వు చెప్పగలవా'' అన్నాడు. గొల్లగదా చెప్పలేడనుకున్నాడు. అదీ కవిత్వ శైలిలో.

'' ఆ, వినండి కవి గారూ. పొద్దున్నే సూర్యుడెందుకొస్తాడంటే చీకటిని పారదోలటానికి. అవునా కవిగారూ. కాకులరుస్తూ ''మేము చీకటిగాదు సూర్యదేవా! కాకులము. నల్లని పక్షులము. మమ్మల్ని తరిమేయకు పారదోలకు. ఆకాశంలో యెగిరివెళ్లి ఆహారం వెతుక్కోవాలి'' అని సూర్యునితో చెప్తూ యెగిరివెళ్తున్నాయి''

''నిజమే. సరిపోయింది. నా కట్టి ఆలోచన, భావం రాలేదు గొల్లా'' అన్నాడు కవి.

''నన్నే ఓడించలేకపోయారు. గొల్ల అడిగినవే చెప్పలేకపోయారు కవీ. కాళిదాసునేం ఓడించగలరు? తిరిగిపొండి'' అన్నాడట నవ్వుతూ.

కాళిదాసింకా యేమడుగుతాడో చెప్పలేనేమో నీవే చెప్పు అంటే కాళిదాసు చెప్తాడేమో అనుకుంటూ ఢక్కా కవి ధారానగరం వేపు వెళ్లక తమ నగరంవేపే నడిచాడట. చూశావా రమేష్! హిస్టారికల్‌గా గూడా బర్డ్ వాచింగ్ చేసే అలవాటుండేదని తేలింది'' అని లేచివెళ్లి షెల్ఫులోనించి మంచి పుస్తకం, తెచ్చిచ్చాడు సురేష్.

తిప్పి చూస్తూ వర్ణ చిత్రాలు చూస్తూ అక్కడక్కడ చదివాడు రమేష్. ఉన్నచోట ఆహారం అందకపోతే, ఆహారం యెక్కడ లభిస్తుందో గుర్తుపెట్టుకుని పక్షులు వలసవెళ్తాయి. కూలీలు రోజు కూలీ దొరికే ప్రాంతానికి వలసవెళ్ళినట్లు, విద్యావంతులు పెద్ద జీతాలందే దేశానికి వలస వెళ్తారు. అది పక్షి స్వభావమే. కాకి జనసంచారమున్నచోట కనబడినా నీచమైన పక్షే. యెంగిళ్ళు, కుళ్లినవీ, నిలవవున్నవీ తింటుంది. అతి ప్రాచీనకాలం నించీ కాక అనే పేరు వ్యాప్తిలో వున్నది. కవిత్త్వంలో రాముడు కాంచిన రాక్షస పక్షేది? కాక. పితృదినంనాడు కర్మకాండలో ''కాకగృధ్ర ప్రీత్యర్థం'' అనేపదం వాడుతారు తద్దినం పెట్టించేవారు. కాకెంగిలి అనే సామెతా పాతదే. ఒరిస్సాలో చిలకసముద్రం, పక్షులకు ఆహారం సప్లై చేస్తుంది. నీళ్లలో క్షారగుణముండి నిలవచేసే శక్తివున్నది నీటికి. గుంపుగా వెళ్లి ఆహారాన్ని కాపాడుకుంటూ కొన్నాళ్లుంటాయి. కొత్తరకం లేదా పరాయిజాతి పక్షులు రావాలని చూస్తే, ఆహారం చాలదని, తరిమేయాలని వికారంగా అరిచీ, పెద్ద రెక్కలల్లార్చీ, పెద్ద రెక్కలను ఆయుధాలలాగా వాడుతూ, తరిమేస్తాయి. కూటికొరకే కోటి విద్యలు'' అని చదివి రమేష్,

''మనుషుల స్వభావమే'' అన్నాడు.

''అందుకే నీకు పురాణగాధలు చెప్పింది'' అన్నాడు సురేష్. మళ్లా పేజీ తిప్పాడు రమేష్. పిట్టలు, పక్షులు యెగిరిపోతున్న చిత్రాలు చూచాడు చిన్నపిట్టలు గూడా మైళ్ల కొలదీ యెగిరిపోగలవు. గాలిలో వాసనను బట్టిపోతాయి. ఆహారమందే చోటు చూసి వస్తాయి. 'వండర్‌ఫుల్' అన్నాడు రమేష్''.

''బిగినింగ్ ఆఫ్ బైబిల్ ఫిల్మ్ చూశావా రమేష్? సముద్రాలు పొంగి యెంత

భూమిని ముంచబోతున్నాయని, ఆకాశము వాతావరణము చూసి గ్రహించిన పెద్దవాడు పెద్దపడవకట్టి ఆహారం వుంచి పడవ తలుపులు మూసేశాడు. సముద్రాలు పొంగాయి గానీ పెద్ద ఓడ తట్టుకుని వెళ్లింది. కొంత వుదృతం తగ్గిందని తెలుసుకుని పెద్ద, చిన్న కిటికీ తలుపు తీసి పావురాన్ని వదిలాడు. అది యెగురుతూ పోయి భూమి దానిమీద చెట్లూ చేమా చూసి, ఆలివ్ కొమ్మ చిన్నది. పోనీ రెమ్మ అందాము, ముక్కుతో కరిచి పట్టుకుని ఓడవేపు తిరిగివచ్చి, పెద్దవాని చేతి మీద వాలింది. అతను తలవాల్చి వున్నాడు. తలెత్తి పావురం ముక్కున వున్న రెమ్మ చూసి, భూమి దగ్గర్లోనే వున్నదని గ్రహించి ఓడ అటువేపు పోనిచ్చి ఒడ్డు పట్టించి, అందర్నీ దిగమని తలుపులు తీశాడు. గమనించాల్సిందేమిటంటే పక్షిని అందునా సాధుపక్షిని వదిలాడు గాని, మరెన్ని ప్రాణులు ఓడలో వున్నా యెవరికీ ఆ పని చెప్పలేదు. చూశావా పక్షికెంత జ్ఞానమున్నదో''.

గద్ద పైకెగిరి స్టెడీగా పోతుంటే నేలమీద బతికున్నా ఆహారం బాగా కనపడి, రివ్వున వాలి తన్నుకు పోతుంది. కోడిపిల్లలు, పాములు కనబడితే వదలదు.

సురేష్ మళ్లా అన్నాడు. ''మనకు, బౌద్ధవాఙ్మయంలోనూ జైనవాఙ్మయంలోనూ దయను నేర్పుతూ కథలున్నాయి. గరుడులకీ, నాగులికీ వైరమని చెప్పారు. గురుడుడు పాములను చంపి తింటుంటే, వాళ్ల లీడరు ''అన్నీ తినేయకు గరుడా. నీకే ఆహారముండదు. రోజుకో నాగు నిస్తాము. యెర్రని వుత్తరీయం యెర్రని పూలదండ వేసి వధ్యశిల మీదుంచుతాము తన్నుకు పోయి తిను'' అని ఒప్పందం చేశాడు.

జీమూతవాహనుడు యెర్ర వుత్తరీయం కప్పుకుని, యెర్రని పూలదండ వేసుకుని ఆహారం వుంచే చోటవుంటే అది నాగు అనుకుని గరుడుడు తన్నుకు పోయి, గోళ్లతో చీరుతూ ముక్కుతో పీక్కుతింటూ ఆశ్చర్యపోయాడు ''తన్నుకోదేం నాగు? యేడవదేం బాధకి?'' అనుకుని ''యెవరు నువ్వు?'' అని అడిగాడు ''అది నీకనవసరం గరుడా. నీ ఆకలి తీర్చుకో'' అన్నాడు జీమూతవాహనుడు. కాని గరుడుడు మళ్లా మళ్లా అడిగితే చెప్పాడు. ''అయ్యో!

తప్పు చేశాను? సిద్ధ విద్యాధర చక్రవర్తి కొడుకు జీమూత వాహనుడు, యుద్ధం ఆపాలని, ప్రజలను కాపాడాలని తమ దొడ్లో వున్న కల్పవృక్షం కోసమే శత్రువులు యుద్ధానికొస్తున్నారని, తల్లిదండ్రులను గూడా ఒప్పించి, వెంటబెట్టుకుని రాజ్యం వదిలి వనానికి వెళ్లిన దయా స్వరూపుని చంపి తింటున్నాను'' అని వాపోయి, బాధపడి, పరిహారమివ్వాలని జీమూత వాహనుని కూచోబెట్టి రెక్కలతో విసిరి నయం చేసి, ''యేదైనా అడుగు యిస్తా'' అన్నాడు గరుడుడు.

''ఈ హింసా, యీ వైరం మానేయి గరుడా. నాగులూ గరుడులూ సమరస భావం అలవర్చుకోండి. నాకింకేమీ అక్కర్లేదు'' అన్నాడు జీమూత వాహనుడు. చూశావా రమేష్ గరుడుడెంత వివేకం దయగలవాడో''.

''చాలా బావున్నది నేనూ చదువుతా. ఆ పుస్తకం పేరేమిటి సురేష్?''

''నాగానందము. అంతే నా రమేష్ మనకి లలిత సంగీతం పక్షుల మీదున్నది. విను'' అని తీయగా పాడసాగాడు సురేష్. ''కొమ్మలో కోయిలా కోయంటదే. రాగతనమోయేమె బాగువోగెరుగదే'' మామిడి చివుళ్ల తింటుందట. అందుకని అంత తీయని గొంతెత్తి, పిట్టకొంచెం కూతఘనం అన్నట్టు పంచమం వరకు అరుస్తుంది. ఒక్కోసారి రెట్టించుకుంటాయి. మొదట మంద్రంలో మొదలెడితే రెండోది మూడోది అందుకుని చాలా దూరానికి వినబడేట్టు కో కోయని అరుస్తాయి. నల్లని చిన్నపిట్ట కనబడదు. పాటే వినబడుతుంది. మెడనెప్పి పట్టేట్టు యెక్కడున్నదో నల్లని పిట్ట అని యెంత సేపు వెతికినా కనబడలేదు. మా తాతగారు ఆయుర్వేద వైద్యుడు. వాళ్ల వూరు వెళ్లేవాడిని. సీమకోళ్లనీ, కాలవలో గుంపుగా వెళ్లే బాతులనీ చూశాను. వేలు విడిచిన మేనమామకు మామిడితోపు వున్నది. ఋతు సమయంలో అక్కడే పాకలో వుండేవాడీయన. కోకిల కంటబడుతుందేమో చూతామని నేనూ మామయ్య వద్దే వుండేవాడిని. కోడిపందెం చూడాలని మేనత్తవున్న వూరు వెళ్లేవాడిని. శ్రీనాథకవి సార్వభౌముడు పల్నాటి వీరచరితము అని ద్విపద కావ్యం వ్రాశాడు. సీసపద్యం అల్లటంలో ఆయనకాయనే సాటి. గుంటూరు మండలమంతా

కాలినడకనే తిరిగాడు. పలనాడు, నల్లమల అడవులు, జాగ్రఫీ వ్రాస్తూ కథ అల్లాడు. కోడి పోరు నిలబడి చూసి వుండాలి. నాగమ్మ కోడినీ బ్రహ్మనాయని కోడిపుంజునూ గరిడీలోకి దువ్వి వదిలారు. మొదట బ్రహ్మనాయుని పుంజే గెలిచింది ''చుట్టును తిరుగుచూ జూటంబుదన్నుచూ గరిడెల్ల తిరుగుచూ గాసిం చేయుచూ, ''నాగమ్మ పుంజును గరిడీ వదిలి పారిపోయేట్టు చేసింది. అంతేనా రమేష్. ఇంద్రుడు కోడి అయే గౌతముని మోసగించాడు. కోడి టైం చెపుతుంది. బ్రాహ్మీ ముహూర్తమైందని కోడి కూసెను. గౌతముడికి స్నానం చేసి వచ్చాక మోసం తెలిసింది. నక్షత్రాలు చూసి, దొంగ కోడి కూసింది అని. చూశావా పక్షికి వాసనబట్టే శక్తేగాక టైం చెప్పే శక్తీ వున్నది''.

'' ఆ కథ కొద్దిగా తెలుసు సురేష్. వివరంగా తెలియదు. గౌతముడేం చేశాడు?'' అనడిగాడు కుతూహలం వల్ల ''శాపపరంపర పెట్టాడు ఇంద్రా! కోడివైపో. ఇంద్రుడైనవాడికి మతిపోతుంది. స్వర్గాధిపత్యం చపలమైనది''. కాని తెల్లారి పెద్దలంతా వచ్చి గౌతముని మందలించి శాపం తిప్పేయ్ అన్నారు సభికులకి యింద్రుడు కోడిలాగా కోడిరంగు రంగుల రెక్కలు లాగా కనబడతాడు. సహస్రాక్షి అని పేరు బడతాడు వంటి మీది మచ్చలవల్ల. అలా శాపం మార్చాడు.''

''పోదామా సురేష్ నీవు జాబ్‌కీ. నేను యింటికీ? కోడియును పిల్లలునూ యెదురుచూస్తూ వుంటారు పుస్తకమూ ఇంటరెస్టింగా వున్నది. ఒక పక్షి రోజుకి రెండు వందలసార్లు మేత తేవటానికి వెళ్లి రాగలదుట. వింతే''

''దాని పేరే పిట్ట మేత. కొంచెం కొంచెం తింటాయి'' ఇద్దరూ నవ్వుకుంటూ లేచారు. తలుపులు మూస్తున్నాడు సురేష్.

''రేపూ యెల్లుండీ పబ్లిక్ హాలిడేస్. ఇంటిదగ్గర చెప్పి వస్తా. కథలూ విహంగ వీక్షణం రెండూ బావున్నాయి. బంగరు బయలులో వాహనం మీద తిరుగుతూ చూద్దామా''

''తప్పకుండాను. బైనాకులర్స్. మేతా పట్టుకెళ్దాం''

''అప్పుడే వచ్చేశావే రమేష్! యెలా రాగలిగావూ? కాఫీ ఫలహారం యివ్వనా? అలా టేబిల్‌ముందు కూచో కుర్చీలో. ఓ పట్టాన ఫామిలీ వదిలి రాలేవే '' ఇల్లే వైకుంఠం కడుపే కైలాసం'' అని చెప్తూ నువ్వే నవ్వుతావు.

సంతోషంగా బల్లముందుంటూ రమేష్ ''చెప్పాగా శలవు అని. పరగడుపుతోనే వైకుంఠం వదిలి వచ్చినా కోడివేపు కోళ్లూ, నావేపు పక్షులు వచ్చి వైకుంఠం నరకం చేస్తున్నాయి. నా కోడి కజిన్ కోడిలాగే దొడ్లో యింట్లోనూ యెగురుతూ కోడిలాగే అరుస్తూ ''కోడీ? నా కోడీ నా కోడీ నా కోడీ! నే నోడిపోతే పోతిగాని కోడిపోయెనయ్యెయో! సంకురేత్రి పండగనాడు సామర్లకోట పోయి అని పాటపాడతాడు. నా పెత్తల్లి కొడుకు మాలకాకిలాగా ఆఫ్రికన్ మేకప్ వాడూ కాకిలాగే అరుస్తాడు ''వసాం! వసూ! గుడ్డ పీలికతే. కొబ్బరినూనె తీసుకురా సైకిల్ తుడవాలి. గాలి కొట్టాలి. పంపున్నదా అని వీధరుగు కింద కూచుని సైకిల్ రిపేర్ చేస్తూ అరుస్తాడు. వసుమతి హేరాయిల్ సీసా చిరిగిన పాతచీరా తెచ్చి యిచ్చి ''కాకిలాగా కాకా అని అరుస్తూనే వుంటాయి. రూపమూ అదే'' అని పరుగుదీసింది. తెల్లని పళ్లుబైటబెట్టి నవ్వాడు కజిన్. అత్త కూతురు విడో తెల్లచీర కాసిబోసి కట్టి నడుస్తూ వంటవాడికి సాయపడుతుంటే అచ్చు బాతులాగే కనిపించింది. అరఖువాలీ చూడాలని మరో బర్డ్ ఫామిలీతో సహా వచ్చాడు. పక్షి పిల్లలన్నీ యేదో తింటూ సందడి'' అని నవ్వుతూ యెదురుగా వచ్చిన వేడి ఫలహారం ఆరగించసాగాడు రమేష్. సురేష్ తానూ కూచుని ఆరగిస్తూ ''చిలకమ్మ పెళ్లీ కోకిలమ్మ పెళ్లీ అని భావ కవిత వున్నది. విన్నావా?'' అన్నాడు.

''వినలేదు మిత్రమా. యెవరల్లారు? కొద్దిగా వినిపించు. మనం బయలుదేరాలి. ప్యాక్ చేశావా? ఆహారం?'' అనడిగాడు. కొత్తా పాతా లేకుండా యిల్లంతా కెలుకుతూ, బాల సాహిత్యం, పెద్దల సాహిత్యం, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్సు, యల్‌టిసీ బోర్డ్ ఒకటేమిటీ అన్నీ వాడుకుంటున్నారు పక్షులు'' అని నవ్వాడు. ''స్వయంపాకమేనా సూరీ! ఒక రిసెర్చ్ స్కాలర్ నలదయమంతి చదివి, ది ప్రిన్స్ కుక్స్ అని వ్రాశాడు. భీముడు వలలుడనే పేరుతో విరటుని

కొలువులో వంటవాడుగా వున్నాడజ్ఞాతవాసం ముగిసేదాకా, అన్నీ టేస్టీ'' అంటూచేతికీ మూతికీ లడాయి వేశాడు రమేష్.

రిమార్కులు వింటూనే సురేష్ కిటికీలోంచి చూస్తున్నాడు. మెడతిప్పి. మళ్లా రమేష్‌ని చూస్తున్నాడు. స్పూన్ అండ్ ఫోర్క్‌తో తింటున్నాడు. ఒళ్లో రుమాలా, మెడ చుట్టూ రుమాలా.

''కిచెన్లో హెల్పర్‌గా ఎక్స్‌పీరియన్సు సంపాయించావా? సాంబారూ యిడ్లీ, వేరుశనగ పచ్చడీ, కొబ్బరి పచ్చడీ వుప్మా దోసె'' అలా అంటూ ప్లేట్లు కాళీ చేస్తున్నాడు రమేష్.

''మనం గూడా అమెరికన్సులాగా టిన్‌ఫుడ్ వాడుకోటం నేర్చాం రమేష్. ఇపుడన్నీ మెషీన్లేగా. కొన్ని చేసి ఫ్రిజ్‌లో వుంచుతా. నెస్‌కేఫ్ కూడా, టీ గూడా మేషీన్‌చేసి యిస్తుంది. గెస్టు వచ్చినా యిబ్బంది వుండదు మోడరన్ జీవితంలో. కోకిలమ్మ పెళ్లేమో కవి సామ్రాట్ అల్లాడు ఫిక్షన్. ఆ దొరకు కూతుళ్లు యిద్దరు. మొదుగలు పూశాయి పెదవులు. వారి పేరులు చిలకతల్లీ, కోకిలమ్మనూ'' అంటే సంస్కృతం, తెలుగు, చిలక నేర్పినవే పలుకుతుంది. కోకిలకు సహజంగా తీయని గొంతు. తెలుగువారు మొదట సంస్కృతాన్ని గౌరవించి తెలుగును అందునా భావకవిత్వాన్నీ వచన కవితనూ చిన్నచూపు చూశారు. వేదపనసలు చెప్పుకుంటూ, వాదములకూ కాలు దువ్వుతూ అతడా తెలుగు రాజింటో ఆగి వున్నాడు. తెలుగు హైక్లాసువారంతా సంస్కృతాన్ని గౌరవిస్తుంటే దానికి యిగో పెరిగింది అని. చిలకతల్లికి కోకిలమ్మకు అసలే పడలేదు. ఛందోబద్ధం కాని తెలుగు కవిత్వాన్ని యెవరూ గుర్తించలేదని. చివరికి సంస్కృతం పడిపోయి తెలుగు వాడుకబాష వ్యాపించి గౌరవింపబడింది. అదే కోకిల. చిలకమ్మ పెళ్లి జానపదగేయం. చిలకమ్మ పెళ్లికి చెలికత్తెలందరూ సందడి చేశారు. పందిట పిచ్చుకలు సందడి చేసె. వాకిట కోళ్లూ బాకాలూదే, నెమలు కన్నియలు నాట్యము చేసె. అలా పక్షులన్నీ చెప్పబడ్డాయి. చివరికి చిలకమ్మ వెలుగుడంత చిలకమ్మ చేయిపట్టి చెంతగూర్చుండె''.

రమేష్ కిటికీ దగ్గరుంటే సురేష్ టేబిల్ క్లీన్ చేసి, వాషింగ్ మెషీన్‌లో అన్నీ క్లీన్ చేసి షెల్ఫులో వుంచి, కావాల్సినవి సద్ది బాగ్ అందుకుని, ''రా! రమేష్, పొద్దెక్కుతున్నది. మానవమారణాయుధాలే వస్తుంటే యీ మెషీన్లో వింతా? రా''.

మంచి పెద్ద ఎలక్ట్రిక్ సైకిల్ మీద తిరుగుతూ, ఆకాశంలోకి చూస్తూ, బైనాకులర్స్‌లోంచి చూస్తూ కారియర్ మీదున్న రమేష్ వినోదించాడు. మంచి నీడనిచ్చే చెట్టుకంటపడగానే కాసేపు దిగి నీడన కూచుని ఆకాశంలోకి చూశారు.

''గద్ద గభీమని నేల వాలి ఆహారాన్ని తన్నుకుపోయినట్టే మనుషులూ తన్నుకుపోతారు. చిన్నప్పుడే వుంటుందా అలవాటు. గద్దలాగా తన్నుకు పోతాడని దూషిస్తారు. వెల్లిపామ్మని సూచిస్తే యిల్లుపట్టి వేలాడేవాటిని గబ్బిలం అని నవ్వుతారు. సిగ్గూ లజ్జాలేకుండా కళ్లు పెట్టుకు చూసే అమ్మాయిని 'యెలా చూస్తున్నదో గుడ్లగూబలాగా' అంటారు. నల్లని పెళ్లికూతుర్ని కాకి ముక్కులాగా వున్నదంటారు. నల్లని అబ్బాయికి యెర్రని భార్యా లభిస్తే కాకి ముక్కుకి దొండపండు అంటారు. మనకు శిబి కథ వున్నది. శిబి యజ్ఞం చేస్తుండగా డేగచే తరుమబడుతూ పావురం ఆయాసపడి పరుగెత్త లేకపోతూ వచ్చి శిబి ఒళ్లో వాలింది. డేగ దూరంగా కూచుని చూసింది. శిబి పావురం తలా ఒళ్లు రాస్తూ, ''భయం లేదు'' అన్నాడు.

''అది నా ఆహారం. వదిలేయ్ శిబీ, నోటిముందు కూడు లాగేస్తావా? ఆకలితో వున్నాను. అది ధర్మం గాదు'' అన్నది డేగ.

''కాపాడుతానన్నాను. వేరే మాంసం యిస్తా తీసుకో'' అన్నాడు శిబి. ''వద్దు. అదే కావాలి.'' పోనీ నా శరీరం కోసి పావురంతో సమానమైనంత మాంసమిస్తా తిను'' అన్నాడు శిబి. '' ఇపుడే యియ్యి'' అన్నది డేగ.

శిబి త్రాసు తెప్పించి పావురాన్నో పళ్లెంలో వుంచి, తాను కోసికొన్న మాంసం రెండో పళ్లెంలో వుంచాడు. పావురమే బరువు. అలా ప్రయత్నించి కోసి కోసి చివరికి తానే రెండో పళ్లెంలో కూచున్నాడు శిబి. అవి పక్షులు గావు.

పక్షి రూపంలో పరీక్షించ వచ్చిన అగ్ని దేవుడు యముడు గాబోలు. సరిగా గుర్తు లేదు'' అని చెప్తున్నాడు సురేష్.

''చివరికేమైంది?'' అన్నాడు రమేష్. కళ్లకడ్డం తీశాడు.

'' ఆ దేవుళ్లిద్దరూ శిబి త్యాగానికి మెచ్చి, నిజరూపాలు చూపి శిబినారోగ్యవంతుని చేసి వరాలిచ్చి వెళ్లారు. కోళ్ల పందేలులాగే పావురాలు పందేలూ వున్నాయి. యెవరి పావురం యెక్కువసేపు ఆకాశంలో తిరుగుతూ పైకిపోగలదో వారు గెలిచినట్టు. సారంగధరుడట్టి పందెంలో పాల్గొని, క్రైసిస్‌లోకి నడిచాడు. ఖర్మకొద్దీ సారంగధరుని పావురం యెగిరెగిరి అలిసిపోయి చిత్రాంగి మేడమీద వాలింది. చిత్రాంగి దాన్ని పట్టుకుని దాచింది. ఆమె సారంగుని సవిత్తల్లి. పావురం కోసం పిన్ని మేడెక్కితే, సారంగుడిని చిత్రాంగి పట్టుకున్నది. పావురమివ్వకపోగా బెడ్‌రూమ్‌లోకి లాగింది. ''నువ్వు మహారాజు రాజరాజనరేంద్రుని భార్యవు. నువ్వు చేసే పనీ నీ ఆలోచనా రాజద్రోహ నేరం కిందికి వచ్చి శిక్ష పడుతుంది. వదిలేయ్'' అన్నాడు కొడుకు. చిత్రాంగేమో అడివిజాతి మనిషి. రాజు వేటకెళ్లి డస్సి దాహంతో బాధపడుతూ భటులకు దూరమైనప్పుడు యీ కోయ యువతి కాపాడిందట. దాన్ని పెళ్లాడి యింటికి తెచ్చాడు. మొదట్లో మహారాణీ వైభవం బాగానే వున్నది. కాని తన యీడు వాడే సవితి కొడుకును చూసేప్పటికి వివశ అయింది. అదను చూసి పట్టేసింది. ''యిది రాజ్యం. అడివి గాదు'' అని చెప్పినా వినలేదు. నీకు శిక్షపడుతుందని గూడా తెలియజెప్పాడు. పెనుగులాటలో వాడి నడుమునకున్న పట్టుదట్టీ, బొడ్లో దోపుకున్న ఛురిక లాక్కున్నది. వాడందలేదు. అది సాక్ష్యం చూపింది. రాజు వేట నించి రాగానే సారంగధరుని మీద నేరం మోపింది. గాట్లు, చిరిగిన చీరా రవికా, తెగిపోయిన జుట్టు, చిట్లిన గాజులు, రక్కులు చూపింది చిత్రాంగి. విచారణ జరిగింది. నేరం ఋజువైంది'' అని పైన యెగురుతున్న పక్షులవంకే చూస్తున్నాడు సురేష్.

''దాసీలు లేరూ మేడలో? యేమి శిక్షపడింది సారంగునికీ?''

''బంగారు నగలు లంచం పెట్టిందేమో చిత్రాంగి. రాజద్రోహ నేరమని స్మశానానికి తీసికెళ్లి కాళ్లూ చేతులూ నరికి అక్కడే వదిలేసి రావాలని శిక్ష వేశాడు రాజు. ధర్మం చెప్పే పీఠము వున్నది'' అని ఫ్లాస్కు మూత తీసి రెండు మూతల్లో ఐస్‌క్రీమ్ నింపి స్పూన్ వేసి ఒకటందించాడు రమేష్‌కి.

''అదేం శిక్షా? తలనరకమనచ్చా? తండ్రిగాదా? విషాదాంతమేనా? నిజం బయటపడలేదూ తరవాతైనా?'' వెలవెలపోతూ చెమటకి తడిసిన మొహం కర్చీఫ్‌తో అద్దుకుంటూ అడిగాడు రమేష్.

''అది హిస్టారికల్ కథ. సంతోష సారంగధర, విషాద సారంగధర అనీ రెండురకాలుగా వ్రాశారు. అంతేగాక కథ గూడామార్చారు. సామంతుడు, రాజుకు వెరిచి, కప్పం కట్టలేక, కూతుర్నిచ్చి పెళ్లి చేశాడనీ, కూతురుకి మాత్రం సారంగధరుని వర్ణచిత్రమే ముఖచిత్రం చూపించాడనీ, కత్తికి భాషికం కట్టి రహస్యంగా పెళ్లి చేశాడనీ కథ అల్లారు. యేమైనా పాయింట్ ఒకటే''.

''శిక్ష అమలు చేశారా తలారులు? దాహంతో పోయాడా సారంగ?'' అన్నాడు ఐస్‌క్రీమ్ స్పూన్‌తో తింటూ.

'సమయానికి, అటుగా బైరాగులు వచ్చి అంతా విని ఆపేయించి, యీ పాటికి నిజం బైటబడి నీ తండ్రియేడుస్తూ వస్తూ వుంటాడు కాపాడాలని. ఇంటికిపో యువరాజా'' అంటే, ''అదేం తండ్రీ, అదేం రాజూ! కొడుకు కెమిస్ట్రీ తెలియదా? కోయ అమ్మాయి మాటలే నమ్ముతాడా రాజు? వయసు మళ్లాక ఆ పెళ్లేమిటీ? నేను పోను మీ కిష్టమైతే మీతో వస్తాను. అని బైరాగుల్లో వెళ్లి పోయాడని. రెండో కథనం. వాళ్లే వెళ్లి నిజం బైటికి తెప్పించి సారంగధరుని నిర్దోషిత్త్వం ఋజువు చేయించి, సింహాసనం మీదుంచి వెళ్లారని. అది చరిత్రాత్మకమే అంటారు. రాజమండ్రిలో సారంగధరమెట్ట అని వున్నది. చిత్రాంగి మేడ అని వున్నది. యేమైనా అది పావురం తెచ్చిన క్రైసిస్సే. బ్రాహ్మలు చిలకల్ని పెంచుతారు. పావురాల్ని పెంచరాదంటారు. కుచేలుని భార్యను మీదేం వర్ణం అనడిగే పంజరంబుననున్న పక్షి చూపె. అంటే చిలకను చూపితే బ్రాహ్మలని.

నవినాశినీ ధవుని నామమెయ్యది అన్న తన చేత జీర్ణవస్త్రమును చూపె. పడతి నీకేమైన బిడ్డలా చెపుమన్న మింటనున్న రిక్కలను చూపె. పేరేమిటని అడిగితే తన వేలితో వామనేత్రమును చూపె. అని పొడుపు కథ పద్యంలో వున్నది'' అని ఈగిల్ ఫ్లాస్క్ మూత తీసి యింకా వేడిగా వున్న బొండాలు రెండు తీసి ప్లేటులో వుంచి రమేష్ కందించాడు. ''తిను''.

''యింతకూ యెవరామె'' అన్నాడు రమేష్ బోండా తింటూ.

''కుచేలుని భార్య. తనకు యిరవై యేడుగురు బిడ్డలు అని, తన పేరు కామాక్షి అని చెప్పింది'' తింటూ చెప్పాడు సురేష్.

''చాలా బావున్నది. కథ రసవత్తరంగా చెప్పగలవు'' పచ్చడి స్పూన్‌తో తింటూ అన్నాడు రమేష్.

''అడివి పావురాయి మాంసం వండి తినిపిస్తే పక్షవాతం నయమౌతుంది. పావురాల టపా వుండేది. అరేబియన్ కథలలో వున్నది. అదొక వృత్తి గూడాను'' అన్నాడు మరో పొట్లం విప్పుతూ.

''యెలా? ఆర్జన వుంటుందా?''

''హోమ్ పీజియన్సని వుంటాయి. అవి తప్పకుండా టపా అందించి తిరిగి టపా తీసుకుని యింటికి వస్తాయి. చిన్న చీటీ మీద ఖబర్ వ్రాసి చుట్టి పల్చని రేకు గొట్టంలో దూర్చి, మూసి, దాని కాలికి తాడుతో కడితే వెళ్లి వస్తుంది. శత్రువులు డేగలను పెంచి వాటిని చంపటం తర్ఫీదిచ్చేవారు ఖబర్ అందకుండా. దాని కాలికి చిరుగంటలు కడితే ఆ చప్పుడుకి అదేమిటో అర్థంగాక డేగ దాని జోలికిరాదు. కొన్ని హోమ్ పీజియన్సు తమను పెంచిన వారిని మరిచిపోవు. యెన్నాళ్లైనా గుర్తుంచుకుని వెతికి వెతికి వస్తాయి. హంస రెక్కలలో బంగారవముంటుందని చెప్పుకునేవారు'' తింటూ చెప్తున్నాడు సరేష్. ''హంసలిప్పుడు లేవు సరిగదా స్వర్ణహంస అసలే లేదు. బాతులున్నాయి రకరకాలవి. ఆ రెంటికీ తేడా ఆకారంలోనేనా విశేషమేమైనా వున్నదా'' ఐస్ వాటర్ బాటిల్ ఓపెన్‌చేస్తూ అన్నాడు.

''పాలూ నీళ్లూ కలిపిన గిన్నె హంసముందుంచితే, పాలు తాగి నీళ్లు వదిలేస్తుందిట హంస. భర్తృహరి కవనం అల్లాడు. హంస నడక అందంగా వుంటే బాతు నడక పిచ్చిగా వుంటుంది''. సురేష్ అన్నీసద్ది సైకిల్ సంచీలో పెట్టి, ''రా పోదాం'' అన్నాడు.

''లంచ్ వేళకి యేదైనా రెస్టారెంట్ వేపుగా పోవాలి. రెండు అవుతుందేమో'' అని వచ్చి సైకిలెక్కాడు రమేష్.

4

'' ఆ పక్షి పేరు తెలుసా సురేష్? దాన్ని చూస్తుంటే మా పున్నమ్మ పెద్ద పిన్నిని చూస్తున్నట్టే వున్నది ''రమేష్ నవ్వాడు.

''నవ్వెందుకూ? యేమిటి పోలిక? కెమెరా జేబులో వుంచుకున్నావా? బైనాకులర్స్ మెళ్లో వేసుకుని ఫొటోలు తీయి. ఒక ఫ్రెంచ్ ఆయన అమెరికన్ బర్డ్స్ అని పుస్తకం తయారుచేశాడు. ఫొటోలు, డ్రాయింగులు వున్నాయి దానిలో. పొద్దున్నే మసక వెల్తురులో బయలుదేరేవాడుట. చాలా ఫొటోలు తీశాడు. తరవాత తాను కల్పన చేస్తూ పెయింటింగ్ వేసేవాడు. ఒక్కోసారి బోయవానిలాగా ఆ అందమైన పక్షిని అపురూపమైన దానిని పేల్చి చంపి తెచ్చి యింటి వద్ద బొమ్మ వేసి రంగులేసేవాడు. కొన్ని అమ్మాడు. కొన్ని ఎగ్జిబిట్ చేశాడు మొత్తానికి ఫేమస్ అయినాడు. కాని వయసు మళ్లి చూపుమందగించింది. మనకూ పంచెవన్నెల రామచిలుక, పెద్ద తోకలున్నవీ వున్నాయి. మగచిలకకే మెడమీద నల్లని చార వుంటుంది. మన నేషనల్ బర్డ్ నెమలి. మగ నెమలికే పింఛమూ జూలమూ వుంటాయి నల్లని మేఘాలు చూడగానే పురివిప్పి ఆడుతుందిట. అలాగే కోడిపుంజుకే జూటం. పెట్టకి వుండదు'' అన్నాడు. చెట్ల మీద బారుగా వాలిన పక్షులను చూస్తూ కొమ్మ కదులుతుంటే చూస్తూ.

''పున్నమ్మ పెద్ద పిన్నిది తిరిగే కాలూ తిట్టే నోరూ. అలా తిరుగుతూ, యెవరి నెత్తి విశాలంగా, ఖాళీగా వున్నదీ, యెవరినెత్తిన యెవరినెక్కిద్దాము అని పరిశీలిస్తుంది. యెవరి దగ్గర డబ్బున్నది, అదంతా యేం మిషపెట్టి లాగేసి, ఖర్చు

చేయించి బికారిని చేసి నవ్వుదాము అని పథకాలు వేస్తుంది. ఊదరపెట్టీ టోకరావేసే అప్పులిచ్చి చక్రవడ్డీ కట్టీ అనుకున్నది చేసి తీరుతుంది. పక్షిలాగే యింటి పట్టున వుండదు. అది ఆకాశంలో తిరిగితే పెద్ద పిన్ని భూమి మీద తిరుగుతుందంతే తేడా అదే ముక్కూ అదే చూపూ, అదే అరుపూ పిన్నికి. రోగిష్టి వాళ్లని ఆరోగ్యవంతుల మధ్య వుంచి వాళ ఐవేజు తెస్తానని వెళ్లిపోతుంది. పెళ్లామా మొగుడా యెవరు మెతక, లేక యిద్దరూ మెతకేనా అని స్టడీ చేస్తుంది మనుషుల్ని. అదుగో ఆ పక్షి మా మేనమామలాగా వున్నది అచ్చుగా'' అని ఫొటో తీశాడు రమేష్.

''యెందుకనలా అనిపించిందీ? యెలా పోల్చగలవు?''

''అది తన గుంపుతో నేల మీదేదో యేరి తింటున్నది. తమ గుంపుకి చెందని పక్షి వస్తే, అరిచి రక్కి తరిమేస్తున్నది. ఆ ఆహారమంతా తామే తినాలి. తమకే చెందాలి. మా అంకుల్ స్టైల్ అదే సురేష్! ఇంటికెవర్నీ రానీయడు. తిట్టి పంపేస్తాడు. అన్ని పన్లూ మనమే చేసుకోవాలి అని ఐడియా. అటు చూడు సురేష్ దాని పేరేమిటి?''

''అదా రాబందు. డొమెస్టిక్ బర్డ్ కాదు. తరచూ చూడము!''

''మాంసాహారేనా?''

''మాంసాహారే. మరేం తినదు, కాకి లాగా. కాకి అన్నీ తింటుంది''.

''గద్దకూ రాబందుకూ తేడా యేమిటి? శరీరంలోనేనా?''

''శరీరంలోనే గాదు, గద్దలాగా యెగరలేదు రాబందు. గద్ద బతికున్న వాటిని చంపితింటే, రాబందు చచ్చిన వాటినీ పీక్కు తింటుంది''.

'' ఐసీ. సరీగ్గా అదే అలవాటు మా అమ్మయ్యకి. సురారపు దొరలు బతికున్న వారిని పీక్కు తింటారు. అమ్మయ్య చచ్చినవారినీ పీక్కు తింటుంది''.

''చచ్చిన వారినెలా పీక్కుతింటుంది? మనిషి గాదా?''

'' ఇంతే నా బర్డ్ వాచర్ తెలివీ? చచ్చిపోయిన నా బిడ్డలనూ మనుమలనూ గూడా వంచిస్తూ యేడిపిస్తూ పొట్ట పోసుకుంటుంది. మరీ మోసం గ్రహించలేని

వారైతే డబ్బూ లాగేస్తుంది నేర్పుగా. బయలు ప్రదేశాలు, మైదానాలు చాలు సురేష్. టౌన్‌లోకి పోదాం రెండు కావస్తున్నది'' అని గుర్తు చేశాడు రమేష్.

'' ఓకే'' అని గిర్రున తిప్పి వేగం హెచ్చించాడు సురేష్.

ఇంకా పక్షులను చూస్తూనే వున్నాడు రమేష్.

'' ఆ జామచెట్టు మీద చిలక అచ్చు మా మరదలు పిల్లలాగా వున్నది సురేష్. ఆ కాకి మా పెత్తల్లి కూతురు రామక్కలాగా అరుస్తున్నది. సరీగ్గా అదే చూపు. ఆ పెట్ట కోడిపిల్లలూ వాహనాల్ని తప్పించుకోటం చూస్తే, మా సర్వెంట్సు పిల్లలల్లే వున్నాయి. ఆ తట్టలో కోడిపిల్లల్ని చూడు సురేష్ తట్టనిండా వున్నాయి''.

''వాటిని అమ్ముతారు'' అన్నాడు సురేష్.

''యిపుడు న్యూబోరన్ బేబీస్‌నీ నర్సింగ్‌హోమ్స్ వారలగే యెడాప్షను పేరుతో సులభంగా విదేశీయులకు అమ్ముతూ డబ్బుచేసుకుంటున్నారట.కేసులు పేపర్లో పడుతున్నాయి. విదేశాల్లో డిజేబుల్డ్ బిడ్డల్ని ఎడాప్ట్ చేసుకుంటే పన్నులు తగ్గిస్తుందిట ప్రభుత్త్వం. ఎడాప్షన్‌కి అందించాక ఆ బిడ్డగతి యేమిటో తెలియదుట. చిలకకి వుప్పూ కారం తాకించరాదు. చస్తుంది. మా పినతాత మైనానీ చిలకనీ పెంచి మాటలు నేర్పాడు. దోర పళ్లు కోసి పళ్లెం వుంచి పంజరంలో వుంచుతాడు. కడ్డీ మీదనించి దిగ వచ్చి కొరికి తింటూ కొంత వుమ్మేస్తాయి. పాల సపోటా జామ యిష్టం''.

''కోకిలకి గూడు కట్టటము రాదుట. గుడ్లూ పొదగటమూ రాదట. కాకి గూట్లో గుడ్లుపెడితే కాకి పొదుగుతుందిట. పిల్లలు తనవే అనుకుని పోషిస్తుందిట. కోకో అనగానే, గుర్తించి తరిమేస్తుందిట కాకి'' అన్నాడు సురేష్.

''కొంత తేడాతో మనుషులూ అంతే. కంటమైతే కంటారు గానీ పెంచే బాధ్యత మరొకరి నెత్తిన రుద్దుతారు. అగ్లీ డక్లింగ్ అనే నవలలోనూ అదే కథ. ఫిషన్. బాతు హంసను బాతు అనుకుని సాకుతుంది. హంసను అవమానిస్తాయి బాతులు. రెక్కలు రాగానే హంస యెగిరిపోతుందాకాశంలోకి. అంటే మేధావి అయిన బిడ్డ డడ్స్ మధ్య వుండడు. తన తెలివిని వాడుకోవాలని వెళ్లిపోతాడు.

అదుగో మంచి రెస్టారెంట్ సురేష్. సరీగ్గా టైమ్‌కి వచ్చాం లంచ్ కానిద్దాం. ఆపేయ్. అటుపోనీ'' అన్నాడు రమేష్. ''బర్డ్ వాచింగ్ వల్ల మనస్సుకు శాంతీ వినోదం కలిగాయి సురేష్. థాంక్స్ వీలున్నప్పుడల్లా వస్తా''.

'' ఓకే'' అని వాహనం ఆపి పక్కగా నిలబెట్టి కీస్ జేబులో వేసుకుని మెట్లవేపు నడిపించాడు సురేష్ రమేష్‌ని.

కథా నిలయం
55840
శ్రీకాకుళం